www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 31 అక్టోబర్ 2025



చేపల వలలో కొండచిలువ



ప్రజాశక్తి- పూతలపట్టు: వర్షాలు విస్తారంగా పడడంతో పూతలపట్టు మండల కేంద్రంలోని భీమా నది ప్రవహిస్తోంది. దీంతో కొందరు స్థానికులు చేపల కోసం బుధవారం రాత్రి వల వేశారు. ఇందులో భారీ కొండచిలువ చిక్కుకుంది. గురువారం ఉదయం వల వేసిన స్థానికులు చేపల కోసం వెళ్లి వలను బయటకు తీయగా అందులో కొండచిలు కనిపించడంతో పరుగులు పట్టారు. అటవీ శాఖ సిబ్బంది కొండచిలువకు ఉన్న చేపల వలన తొలగించి కలికిరి కొండ సమీపంలో వదిలేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మేయర్ దంపతుల జంటహత్య కేసు

తీర్పు శుక్రవారానికి వాయిదా



నిందితులను కోర్టు నుంచి బయటకు తీసుకువస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దివంగత నగర మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ జంటహత్య కేసుపై తొమ్మిదో అదనపు జడ్జి శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం 2.30 నుండీ సాయంత్రం 6గంటల వరకు జిల్లా కోర్టు ఆవరణంలోని తొమ్మిదో అదనపు కోర్టులు ఇరువర్గాల వాదోపవాదాలు విన్నారు. జంట హత్యల కేసులో నిందితులు ఏ 1 నుండీ ఏ 5 వరకు ముద్దాయిలను పోలీసులు 2.30 గంటలకు జిల్లా జైల్ నుండీ పోలీస్ భద్రత నడుమ కోర్టులో హాజరుపరిచారు. సాయంత్రం 6 గంటల వరకు ఇరువర్గాల తరపు లాయర్ల వాదోపవాదనలు వినిపించారు. దీంతో జంట హత్యల కేసు తీర్పును ఈనెల 31వ తేదీ శుక్రవారానికి వాయిదా వేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జంట హత్యకేసులో ఐదుగురు నిందితులను తొమ్మిదో అదనపు కోర్టులో హాజరుపరచనున్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు



మురుగు నీటిలో నడిచి స్కూల్‌కి వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని కేఎం పురం పంచాయతీ ప్రాథమిక పాఠశాలకు కూతవేటు దూరంలోని రోడ్డు గుంతలమయై వర్షపు నీరు చేరి చెరువును తలపించే విధంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. పక్కనే స్కూలు ఉండడంతో విద్యార్థులు ఆ మురుగునీటిలో నడిచి స్కూల్‌కి వచ్చి వెళుతున్నారని దీంతో విష జ్వరాలు భారిన పడే ప్రమాదముందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ద్విచక్రవాహనదారులు సైతం పలు మార్లు గుంతలో పడి ప్రమాదాల బారిన పడ్డారని స్థానికులు చెబుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు ఇలానే ఉన్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు నిల్వ చేరి దోమలకు ఆవాసాలుగా మారాయని, పురుగులు, దుర్వాసతో ఇబ్బందులు పడుతున్నామని, విద్యార్థుల స్కూళ్ళకి వెళ్లాలన్న ఆ నీళ్లలోనే వెళ్లాలని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి రోడ్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేలకొరిగిన వరి పంట



ప్రజాశక్తి- కార్వేటినగరం: గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి చేతికి అందే సమయంలో వరి పంట పూర్తిగా నేలకు వాలిపోయింది. దాదాపుగా రెండు ఎకరాల వరి పంట పాడైపోయిందని రైతు గుణశేఖర్ తెలిపారు. వర్షానికి వరి నేలకు పడిపోవడంతో దిక్కుతోచని స్థితి ఏర్పడిందని, సుమారు రూ.90వేలు చేతికందే సమయంలో ఇలా జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కేఎం పురం గ్రామంలోనూ ఇదే పరిస్థితి. తక్షణమే ప్రభుత్వం తమను ఆదుకోవాలని, సంబంధిత అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి జిల్లా అధికారులకు పంపి న్యాయం చేయాలని అధికారులను రైతులు కోరారు.

జెడ్‌పి ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు



ఎంపిడిఓ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంను గురువారం జడ్పీ ఛైర్మన్ జి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో సెలవులో ఉండటంతో ఈఓఆర్డి రాజేంద్ర బాలాజీతో కలిసి పలు రికార్డులు, ఫైల్స్‌ను పరిశీలించారు. అలాగే మండలంలోని నీటి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. పలమనేరు మండలం మండపేట కోటూరు గ్రామానికి నీటి సమస్య ఎక్కువగా ఉన్నదని, గతంలో ఇక్కడ బోరు వేశామని, బోరు మోటర్ అవసరం ఉన్నదని తెలపడంతో తక్షణం నీటి బోరు మోటార్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్‌పి ఛైర్మన్ అధికారులను ఆదేశించారు.

రైతులకు దళారుల బెడదలేని మార్కెట్



సమావేశంలో మాట్లాడుతున్న కడ పీడీ వికాస్ మరమ్మత్

ప్రజాశక్తి -కుప్పం: రైతులు పండించిన పంటలను దళారుల బెడద లేని మార్కెట్ వసతిని కల్పిస్తున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. రోవర్ ఇన్ కో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు మార్కెట్ వసతి కల్పించడం జరుగుతుందని, దళారుల బెడద లేకపోతే రైతులు పండించిన పంటలకు అధిక గిట్టుబాటు ధర లభిస్తుందని పీడీ తెలిపారు. కుప్పం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం రోవర్ ఇన్ కో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు, ఎంటర్ప్రెన్యూగా బిజినెస్ చేస్తున్న రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, ఏడీహెచ్ పల్లవి, రైతులు పాల్గొన్నారు.

విజేతలకు సర్టిఫికేట్లు ప్రదానం

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఈనెల 26న పోలీస్ పిల్లలు, విద్యార్థులు, పోలీసులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు గురువారం క్యాష్ రివార్డ్, సర్టిఫికేట్స్ జిల్లా ఎస్పీ తుషార్ డూడి అందజేశారు. ఈ పోటీల్లో విద్యార్థులు, పోలీసులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు.

నేటి నుంచి పకడ్బందీగా రీ సర్వే

నవంబర్ 30 లోపు రెండవ విడత రీ సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్‌లో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భూముల రీ సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, సర్వే అధికారులతో, రెండో విడత, మూడో విడత రీ సర్వే పనులు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మోహన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే మూడో విడత పారదర్శకంగా నిర్వహించాలని, మూడో విడత సర్వే కార్యక్రమాలలో అమలలో సుమోటో కరెక్షన్ నవంబర్ 10వ తేదీ లోపల పూర్తిచేయాలని ఆదేశించారు. భూమి రికార్డులలో సవరణలు, పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు సహాభూమికి సంబంధించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో విఆర్‌ఓలు, విలేజ్ సెక్రెటరీల నుంచి ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. తహశీల్దార్లు ఎక్స్టెన్షన్ వేరియేషన్ బౌండరీ వేరియేషన్ జాయింట్ ఎల్పీఎం కరెక్షన్లకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వస్తాయని ఇందుకు సర్వే శాఖతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని తెలిపారు. మొదటి విడత పైలెట్ ప్రాజెక్టు కింద 31 గ్రామాలలో 30,774 ఎకరాలు భూమిని సర్వే చేయడం జరిగిందని తెలిపారు. రెండో విడత రీసెర్వే కార్యక్రమం అమలులో భాగంగా నగిరి, చిత్తూరు, పలమనేరు నియోజకవర్గం వర్గాలలో 38 గ్రామాలు రీసర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందని, సుమారు 40,359 ఎకరాల భూమిని రీ సర్వే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. మూడో విడత రీ సర్వే కార్యక్రమాలలో భాగంగా 12 గ్రామాలలో 3,859 ఎకరాల భూమిని రీసెర్వే కార్యక్రమం నిర్వహించుచున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 31వ తేదీ నుంచి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే డిడి జయరాజు, ఏడి ఇన్చార్జి పిఎస్ శాంతిరాజ్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా



సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి షకీల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి జిల్లాలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 5వ జిల్లా మహాసభలు గురువారం చిత్తూరు యుటిఎఫ్ భవన్లో ఘనంగా ప్రారంభమైంది. ముందుగా సీనియర్ నాయకురాలు ప్రమీల జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సభలకు యూనియన్ అధ్యక్షురాలు లలిత అధ్యక్షత వహించారు. ఈ సభలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలపై పనిభారం పెంచుతూ కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. 50 సంవత్సరాలు ఐసిడిఎస్ పూర్తయిన సందర్భంగా సమస్తాగతం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వలన అంగన్వాడీలకు వేతనాల పెరగకపోవడంతో 42 రోజులు సమ్మె సందర్భంగా హామీలను ఇంకా కొన్ని అమలు చేయలేదని, ప్రధానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా మాట్లాడుతూ దేశంలో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక కార్మిక సంఘం సిఐటియు అన్నారు. సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు రాష్ట్రంలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి షకీలా మూడు సంవత్సరాల నివేదిక ప్రవేశపెడుతూ మూడు సంవత్సరాల కాలంలో జరిగిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం హాజరైన ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై చర్చలు జరిపారు. జిల్లాలో అధికారులు పనిపై తీవ్రమైన వదులు తీసుకొస్తున్నారని మానుకోవాలని సభ్యుల అభిప్రాయపడ్డారు. మహాసభల్లో యూనియన్ జిల్లా నాయకులు మమత, విజయ, ధనకోటి, షీలా, సరళ కస్తూరి, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత

ఎస్సీ, బీసీ హాస్టల్స్‌కు త్వరలోనే నూతన భవనాలు

- ప్రజాశక్తి కథనంపై స్పందించిన కలెక్టర్

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం పట్టణం మునస్వామిపురం లోని ఎస్సీ, బీసీ హాస్టల్లో నెలకొన్న సమస్యలపై 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన 'సమస్యలకు నిలయంగా సంక్షేమ వసతి గృహాలు' కథనంపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. కుప్పం హాస్టల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాశక్తిలో సవివరంగా ప్రచురితమైన కథనంపై స్పందించాలంటూ దళిత నేతలు దేవరాజ్, తదితరులు గురువారం చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 'ప్రజాశక్తి' కథనంపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ హాస్టల్ భవనాల నిర్మాణానికి ఎస్టిమేట్స్ వేయాలని నూతన భవనాలను త్వరలోనే నిర్మిస్తామని పేర్కొన్నట్లు తెలిపారు. ఎస్సీ, బీసీ హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలను చూసిన కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు.



కలెక్టర్‌ను కలిసిన దళిత సంఘాల నాయకులు

దోబీ ఘాట్‌కు స్థలం కేటాయింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- వి కోట

ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వీకోటలో మునిగిన దోబీ ఘాట్ కథనానికి అధికారులు స్పందించారు. వీ కోటలోని కీళ్లపల్లి చెరువులో రజకులకు జీవనాధారమైన దోబీ ఘాట్ మునిగిపోయిన విషయంగా ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. వార్తపై జిల్లా అధికారులు స్పందించి వీకోట మండల అధికారులకు సత్వరం సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మండల గంగాభవాని రజక సంఘం ఆధ్వర్యంలో సంఘ నాయకులు గురువారం తహశీల్దార్ ఉదయ సంతోష్, ఎంపీడీవో వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ రజక సంఘ సభ్యులకు వెంటనే దోబీ ఘాట్‌కు స్థలం కేటాయించి, నీటి బోరు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రజక సంఘం నేతలు

జిల్లాలో నేషనల్ సెంట్రల్ హెల్త్ మిషన్ టీం పర్యటన

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ సెంట్రల్ టీం నవంబర్ 3 నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నట్లు డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సిలు, జిల్లా ఆసుపత్రులు, పిహెచ్‌సిలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, అంగన్వాడీ సెంటర్లను నేషనల్ హెల్త్ మిషన్ టీమ్ సందర్శిస్తారని తెలిపారు. వైద్యాధికారులు ప్రతి ఆరోగ్య సేవను క్వాలిటీగా, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల రికార్డులను అప్డేట్ చేసుకోవాలని, పిహెచ్సి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, అన్ని ఆరోగ్య పరికరాలు, వ్యాక్సిన్ ఫ్రిజ్లు, డెలివరీ రూమ్లు, పరికరాలు, లేబరేటరీ పరికరాలు, మందులు అన్నింటినీ స్టాక్ ప్రకారం ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఫండ్స్ ఏ విధంగా ఖర్చు చేస్తున్నది పక్కా రికార్డులను దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటప్రసాద్, హనుమంతరావు, ప్రవీణ, గిరి, అనిల్ కుమార్, నవీన్ తేజ్ రాయి, అనూష, వేణుగోపాల్, జార్జి, రోజా రాణి, శ్రీవాణి, కిరణ్ కుమార్, మానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఓ

'మొంథా'ను సిఎం ఎదుర్కొన్న తీరు అద్భుతం

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్‌ను వణికించిన మొంథా తుపాన్ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎదుర్కొన్న తీరు మహా అద్భుతమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో కొనియాడారు. మొంథా తుపాన్ బలహీనపడడంతో రాష్ట్రానికి ముప్పు తప్పిందని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ముందస్తు చర్యలకు అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. తుపాను వల్ల నష్టపోయిన ప్రజలను స్వయంగా పరామర్శించడంతోపాటు బాధితులకు సహాయం అందించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడం స్ఫూర్తిదాయకమన్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన ప్రతి కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఉడా ఛైర్మన్



సచివాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్న ఉడా ఛైర్మన్

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మండలం నూలుకుంట పంచాయతీ సచివాలయాన్ని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజాసమస్యలతోపాటు పారిశుధ్యంపై సమీక్షించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రతి సచివాలయ పరిధిలోను ప్రజాసమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంతోపాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కడ అడ్వైజరీ కమిటీ మెంబర్ రామచంద్ర, కాణిపాకం దేవస్థానం బోర్డు సభ్యురాలు వసంతమ్మ, క్లస్టర్ ఇంచార్జ్ హైదర్, కన్నన్, ఏఎంసీ డైరెక్టర్ సుబ్బు, కదిరప్ప పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం పోలీస్ రిలీఫ్ ఫండ్ నుండి లక్ష రూపాయల రెండు చెక్కులను బాధిత కుటుంబాలకు చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి అందజేశారు. చిత్తూరు జిల్లా తాలుకా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదానికి గురైన మురుగేశన్ కుటుంబానికి రూ.50వేలు, జిల్లా సాయుధదళంలో విధులు నిర్వహిస్తూ ఇంటికి వెళుతున్న సమయంలో బైక్ యాక్సిడెంట్‌కు గురైన రవితేజ నాయక్ సతీమణి రెడ్డెమ్మకు రూ.50వేలు చెక్కును ఆసుపత్రి ఖర్చుల కోసం అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల పనితీరు భేష్

- తుపాన్ సమయంలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

మొంథా తుపాను కారణంగా విద్యుత్తు వ్యవస్థ కొంతమేరకు దెబ్బతింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ల ఆదేశాల మేరకు రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల సిఎండిలు శివశంకర్ లోతేటి, పృథ్వీతేజ్ ఇమ్మడి, పి.పుల్లారెడ్డిలు ముందు జాగ్రత్తలపై తక్షణ చర్యలు తీసుకున్నారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి నిత్యం వీడియో కాన్ఫరెన్స్, టెలీకాన్ఫరెన్సును నిర్వహిస్తూ, అధికారులు, సిబ్బందికి ముందస్తు జాగ్రత్తలు, సూచనలు చేస్తూ అప్రమత్తం చేశారు. తద్వారా తుపాను నష్టాన్ని కొంతమేరకు తగ్గించేందుకు అవకాశం ఏర్పడింది. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో తక్కువ సమయంలోనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. ఈ తుపాను కారణంగా ఎపిఎసిపిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎక్కువగా విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లగా వైఎస్ఆర్ కడప, చిత్తూరు జిల్లాల్లో ప్రభావం తక్కువగా వుంది. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో తుపాను కారణంగా 33కెవి సబ్-స్టేషన్ల బ్రేక్-డౌన్, విద్యుత్తు స్తంభాలు, లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతినడంతో 6 పట్టణాలు, 11 మండలాలు, 148 గ్రామాల్లో 10,982 విద్యుత్ కనెక్షన్లు, 4,337 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం సంస్థ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు అతితక్కువ సమయంలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాయి. జోరుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకల్లో ఉధృతంగా వున్న నీటి ప్రవాహానికి బెదరకుండా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణే ధ్యేయంగా సిబ్బంది పనిచేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రేయింబవళ్ళు శ్రమించిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయం.



జోరు వానలోనూ విధుల్లో విద్యుత్ సిబ్బంది



విద్యుత్తు సరఫరాపై అధికారులతో చర్చిస్తున్న సిఎండి శివశంకర్ లోతేటి

మనమందరం ఒకే కుటుంబం..

పోలీసు మృతుల కుటుంబాలతోఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులు, ఆఫీస్ సిబ్బంది సమక్షంలో విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాల సమస్యల పరిష్కారం కొరకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మనమందరం ఒకే కుటుంబమని, ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా అందరం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పోలీసులు తమ ప్రాణాలను అర్పించిన తర్వాత వారి కుటుంబం మన కుటుంబమని, వారికీ ఎల్లప్పుడూ ప్రభుత్వం, పోలీస్ శాఖ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబాల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.



మృతి చెందిన పోలీసు కుటుంబాలతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ముగ్గురే సిబ్బంది..

- పరిష్కారం కాని సమస్యలు
- వెనుతిరుతున్న ప్రజలు
- ఇదీ పాలెంపల్లి సచివాలయ దుస్థితి

ప్రజాశక్తి -పుంగనూరు: పాలెంపల్లి సచివాలయంలో తగినంత మంది సిబ్బంది లేరు.. నిత్యం వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలు అపరిష్కృత సమస్యలతో నిరాశతో వెను తిరుగు తున్నారు. పై స్థాయి అధికారులు ఇప్పటికైనా స్పందించి తగినంత మంది సిబ్బందిని నియమించి ప్రజల సమస్యలు పరిష్కరించాల్సి వుంది.

ముగ్గురే సిబ్బంది..

పాలెంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయంలో ముగ్గురే సిబ్బంది వున్నారు.. వివిధ పనులపై వచ్చే ప్రజలు సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జులైలో సచివాలయ సిబ్బంది బదిలీలు చేపట్టారు. పాలేంపల్లె గ్రామ పంచాయతీ సచివాలయంలో 12 మంది సిబ్బంది ఉండవలసి ఉండగా ముగ్గురు మాత్రమే విధులు నిర్వర్తి స్తున్నారు. వారిలో ఒకరు ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీస్, వ్యవసాయ శాఖకు సంబంధించిన వారు మాత్రమే సచివాలయంలో ఉన్నారు. మిగిలిన తొమ్మిది మంది బదిలీపై వచ్చారా ? లేదా.. కనీస సమాచారం కూడా సచివాలయంలో చెప్పే పరిస్థితి లేదు.

పరిష్కారం కాని సమస్యలు

నిత్యం పంచాయతీ పరిధిలోని ప్రజలు వివిధ పనులపై సచివాలయం వద్దకు రావడం, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. జులైలో బదిలీలు పూర్తయి నాలుగు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు తగిన సిబ్బంది రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుగాలి మిట్ట వీఆర్‌వో ఇన్‌ఛార్జిగా ఉన్న పాలెంపల్లి పంచాయతీ ప్రజలు పనిపై వీఆర్‌వోకు ఫోన్ చేస్తే అక్కడ లేదని సుగాలి మిట్టకు రావాలని చెబు తున్నారన్నారు. అయితే సుగాలి మిట్ట సచి వాల యం వద్దకు వస్తే 'నేను పుంగనూరుకు వచ్చాను.. మీరు ఇక్కడికే రండి..' అని పలు మార్లు తిప్పించు కుంటు న్నారని వారు ఆరో పిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పాలెం పల్లె సచివా లయంలో అవసరమైన 12 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని స్థానికు లు కోరు తున్నారు.



తగినంత సిబ్బంది లేని పాలెంపల్లి సచివాలయం



ఎంపీడీవో వివరణ

మండలంలోని పాలెంపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో ముగ్గురే సిబ్బంది ఉన్నారని దీనిపై ఎంపీడీవో అప్పాజీని వివరణ కోరగా త్వరగా ఏప సచివా లయాలలో సిబ్బంది తక్కువ ఉన్నారో తెలుసుకొని వారంలోపు పూర్తి స్థాయిలో సచివాలయాలలో పనులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిపి బ్రౌన్ జయంతి నిర్వహణపై హర్షం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): తెలుగు సూర్యుడు సిపి బ్రౌన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడంపై తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి తులసినాథం నాయుడు, పుష్ప హర్షం వ్యక్తం చేశారు. విదేశీయుడు అయినప్పటికీ తన జీతాన్ని తెలుగు భాషా సేవకే వెచ్చించిన సిపి బ్రౌన్ గురించి నేటి తరానికి తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి తెలుగు భాషా రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై చర్యలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వినియోగించినా చర్యలు తీసుకుంటామని నగర పాలక ఆరోగ్య అధికారి డాక్టరు లోకేష్ హెచ్చరించారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం నగరపాలక పరిధిలో పలు దుకాణాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు, వినియోగంపై ప్రజారోగ్య విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల ఎదుట 'ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు విక్రయించబడవు' అని బోర్డులు ఏర్పాటు చేయించారు. ఎంహెచ్‌వో ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శుల బృందం నగరంలోని పొన్నియమ్మగుడి వీధి, చర్చివీధి, సుందరయ్యర్ వీధి, రాములుగుడి వీధి, బజారు వీధి తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. నిబంధన ప్రకారం వీటిని ఉపయోగించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

1న నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం, సాయి గార్డెన్ సిటీలో వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నూతన విగ్రహం ప్రతిష్ఠించనున్న అభయ ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నవంబరు1వ తేదీ నుండి నవంబర్ 3, 2025 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యాగాలు కార్యక్రమాలు, హోమాలు, అర్చనలు, పూర్ణాహుతి వంటి ఘట్టాలతో నిర్వహిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 225 మంది విద్యార్థులకు కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది రెండు రోజులు పాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులు విజయలక్ష్మి రాజకుమార్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించి వారికి రక్తహీనత 'హెచ్ బి, డయాబెటిక్ (ఆర్ బి ఎస్) ఎత్తు బరువు బీపీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సూపర్వైజర్, ఇద్దరు ఎమ్ ఎల్ హెచ్ పి లు, నలుగురు ఏఎన్ఎంలు, 14 మంది ఆశా కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమ శిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు..

ప్రజాశక్తి-పలమనేరు: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పలువురు వక్తలు అన్నారు. ఎస్‌వీకెజి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాము కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వెంకటేశులు మాట్లాడుతూ కళాశాలలో వివిధ రకాల సదుపాయాలు ఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే సాధించ లేనిదంటూ ఏమీలేదని తెలిపారు. విద్యార్థుల మధ్య ఈర్ష్య, రాగద్వేషాలు ఉండకూడదని, సంస్కార వంతమైన విద్య దేశానికి వెన్నెముక అని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టరు సురేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి సర్వతో ముఖాభివృద్ధిగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ సమన్వయకర్త డాక్టరు ఎ. జయశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-పలమనేరు: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పలమనేరు మండలంలో మండల స్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీలు హైస్కూలులో నిర్వహించారు. వ్యాస రచన పోటీ, వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓలు లీలారాణి, బాలసుబ్రమణ్యం, హై స్కూల్ హెడ్ మాస్టర్ షంషేర్ పర్యవేక్షించారు. ఐదు మండలాల వారు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి -కుప్పం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అర్హులైన ప్రతి మహిళకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి అందుతోందని టిడిపి ఇన్చార్జి ప్రతాప్, కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, టిడిపి మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. కుప్పం టిడిపి కార్యాలయంలో గురువారం మహిళా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మహిళలకు టిడిపిలో అధిక రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నామినేటెడ్ పదవులు సైతం సముచితమైన స్థానం కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, కడ అడ్వైజరీ సుగుణమ్మ రెడ్డి డైరెక్టర్ ఆర్యూగం, బెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమలే, గంగమ్మ గుడి డైరెక్టర్ శారదమ్మ, వనిత, మహిళా నేతలు పాల్గొన్నారు.

పంచాయతీల సమన్వయ కమిటీ సమావేశాలు



ప్రజాశక్తి -కుప్పం: ప్రతినెలా పంచాయతీ లీల వారీగా గ్రామ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించేలా పార్టీ కేడర్‌ను మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఏపీఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశంలో భాగంగా గురువారం కుప్పం మండలం నూలుకుంట, నడుమూరు, వెండుగంపల్లి, కొత్తపల్లి పంచాయతీల పరిధిలో మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్, ఏపీఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్ సమావేశాలు నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత టిడిపి శ్రేణులపై ఉందని ఎక్కడ సమస్యలున్నా అక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నందుకే పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉడా డైరెక్టర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యులు శాంతారాం, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రామచంద్ర, హైదర్ వలి, శీనివాసులు, సర్పంచ్ క్రిష్ణప్ప, సంతోష్, రమేష్, వేది, గాయత్రి, వసంతమ్మ, సుబ్బు, వెంకటేష్, నాగరాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించి ఇంజనీరింగ్ పనులను తనిఖీ చేశారు. సంతపేటలో కాణిపాకం రోడ్డు సెంట్రల్ లైటింగ్ పనులు, బటర్ ఫ్లై లైట్లు ఏర్పాటును పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంతపేటలో కాలువ పనులు పరిశీలించి కాలువ నిర్మాణానికి వీలుగా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం గాంధీ రోడ్డు విస్తరణ పనులను తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫుట్ పాత్, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నగరంలో ప్రస్తుతం జరుగుతున్న ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకొని పనులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు తహశీల్దారు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -బంగారుపాలెం: బంగారుపాల్యం మండల తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆగస్టు 3, 2024వ తేదీ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన మండల తహశీల్దారు కార్యాలయ సుందరీకరణకు కృషి చేశారు. అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందిన తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ 1987 ఉద్యోగంలో చేరినప్పటి నేడు ఉద్యోగ విరమణ వరకు 38 ఏళ్ల ఉత్తమ సేవలు అందించారని పలువురు ప్రశంసించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : గుడిపాల మండలం మండి కృష్ణాపురం గ్రామ పంచాయతీ పెరుమాళ్లకుప్పం గ్రామం లోని వృద్ధురాలు అలివేలును మండల టిడిపి నాయకులు పరామర్శించారు. ఆమె నివసిస్తున్న పెంకుటిల్లు వరుస వర్షాలకు గోడలు పాడై కూలి పోయింది. ఇంటిలోని వస్తువులు నీటి పాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వారి ఆదేశాల మేరకు.. గుడిపాల మండల టిడిపి నాయకులు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది వృద్ధురాలు నివాసాన్ని పరిశీలించారు. ఇల్లు కూలిపోవడంపై ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ధైర్యం ఇచ్చారు. తక్షణ సాయంగా బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్య క్రమంలో స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం, నాయకులు గోపి పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలోని పార్వతి స్వయంభీశ్వర సన్నిధి మండపంలో వేదమంత్రాల నడుమ శివపార్వతుల కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం 11 గంటలకు నూతనంగా నిర్మించిన పార్వతి స్వయంభీశ్వర సన్నిధి కల్యాణ మండపాన్ని అర్చకులు కలశాలు హోమాలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 5 గంటల వరకు పార్వతీ, స్వయం భీశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం చేశారు. సాయంత్రం విగ్రహాలను ఊరేగించారు. అల్పాహారం, అన్నదానం నిర్వహించారు.

ముడిల్లె విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -వెదురుకుప్పం (నగరి): నగరి డివిజన్ లెవెల్లో జరిగిన చెస్‌పోటీల్లో మండలంలోని ముడిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 14, అండర్ 17 విభాగాలలో లేలుప్రసాద్, జగన్, వర్షిణి, పూజిత, దీప, రూప కిరణ్, నవ్యశ్రీ, లోకేశ్, ఆశ లక్ష్ పదిమంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై తమ సత్తా చాటారు. అధిక సంఖ్యలో విద్యార్థులు జిల్లాస్థాయిలో సెలెక్ట్ అవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. వీరే స్ఫూర్తి విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

కోటి సంతకాల సేకరణ



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సి పాల్టీలోని జిలా ని సర్కిల్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన 'రచ్చబండ - కోటిసంతకాల సేకరణ' లో పలమనేరు నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటే గౌడ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ పరిశీలకులు వెంకట రెడ్డి యాదవ్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అనాధకు అంత్యక్రియలు

ప్రజాశక్తి - రొంపిచెర్ల: రొంపిచెర్లలో యాచక వృత్తిలో ఉన్న అనాథ మహిళ మృతి చెందింది. రొంపిచెర్ల పోలీసు సిబ్బంది హోమ్ గార్డ్ రవి, కానిస్టేబుల్ గంగరాజులు మహిళ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు వృత్తిలో ఉంటూ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మహిళ యాచక వృత్తిలో ఉండి బస్టాండ్‌లో తల దాచుకునేది. గురువారం ఉదయం 8 గంటల సమయంలో బస్టాండ్ ఆవరణలో మృతి చెందింది. చుట్టు ఉన్న స్థానికులు పట్టించు కోకపోవడంతో విషయం తెలిసిన హోంగార్డు రవి, కానిస్టేబుల్ గంగరాజులు కొందరి సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో వారిద్దరు హోంగార్డ్ రవిని, కానిస్టేబుల్ గంగరాజు ను అభినందించారు.

ముగిసిన జిల్లా సపక్ తక్ర ఎంపిక పోటీలు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలోని గంగమ్మ గుడి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14, అండర్ 19 బాల బాలికల విభాగంలో సపక్ తక్రా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కావటి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో కూడా బాగా రాణించాలని,రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు బాగా రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులకు సూచించారు. చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డాక్టర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 2,3వ తేదీలలో అనంతపురం జిల్లా, ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ దర్శకులు లోకనాదం, శరత్, సురేష్, దేవానంద్, లోకేశ్వర్, హరి, మోహన్, గంగాధరం పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

అధికారులకు జెడ్‌పీ సీఈవో ఆదేశం

ప్రజాశక్తి- కార్వేటినగరం : ఇంటి నిర్మాణాలను, జెడ్‌పి నిధులతో చేపట్టిన వివిధ నిర్మాణ పనులు వేగవంతం చేయా లని జెడ్‌పీ సీఈవో రవికుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. కార్వేనగరం ఎంపీడీవో కార్యా లయాన్ని జెడ్‌పి సీఈవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో సమావేశం నిర్వహించారు. జెడ్‌పీ సీఈవో మాట్లా డుతూ ఇంటి నిర్మాణాలను, పారిశుధ్య పరిరక్షణ పనులు, జెడ్‌పి నిధులతో చేపట్టిన వివిధ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ, తాగునీటి ట్యాంకుల పారిశుధ్య నిర్వహణ, జెడ్పీ నిధులతో నిర్వహిస్తున్న పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తతతో వివిధ జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ఐటిఐ కళాశాలలో సిసి రోడ్డు ఏర్పాటుకు రోడ్డును పరిశీలించారు. ఎంపీడీవో కార్యా లయంలో రికార్డులను పరిశీలించారు. సీఈఓ వెంట ఇన్‌ఛార్జి ఎంపీడీవో విద్యావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, హౌసింగ్ ఎఇలు పా ల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జెడ్‌పీ సీఈవో రవికుమార్‌నాయుడు

సమస్య పదిలం..కానరాని పరిష్కారం

- వర్షంతో రహదారి గుంతలమయం
- వాహన చోదకులు, పాదచారులకు ఇక్కట్లు
- పట్టించుకోని రవాణా శాఖా కార్యాలయ అధికారులు

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): స్థానిక రవాణా శాఖ కార్యాలయం ఎదుట బురద కుంటను తలపిస్తోంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏకంగా రవాణా శాఖ కార్యాలయం ఎదుటే ఈ దుస్థితి ఏర్పడినా ఆ శాఖాధికారులు పట్టించుకోకుంటే ఇక వాహనాల రాకపోలకు భద్రత ఏదని ఏదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కానరాని పరిష్కారం

జాతీయ రహదారికి కూత వేటు దూరంలో ఉన్న రవాణా శాఖ కార్యాలయం ఎదుట మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి నీరు నిలిచి బురద కుంటను తలపిస్తోంది. ఈ కార్యాలయం పలమనేరు శంకరయ్యపేట రహదారిలో జాతీయ రహదారికి చేరుతుంది. ఈ దారి మీదుగా 20 గ్రామాలకు చెందిన వాహన చోదకులు, ఆటోలు, పాఠశాల బస్సులు ప్రయాణిస్తున్నాయి. ఈ రహదారి పూర్తిగా గుంతలమయమై ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడింది.

వర్షంతో బురదమయం

ఈ కార్యాలయానికి పనులు నిమిత్తం వచ్చేవారు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే రవాణా శాఖ అధికారులు కూడా పట్టించుకోక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని పలువురు వాపోతు న్నారు. అధికారులు స్పందించి కనీసం ప్రభుత్వ కార్యాలయం ఎదుట అయినా రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాలు అరికట్టాలని స్థానికులు కోతున్నారు.



వాహన చోదకులు, పాదచారులకు ప్రమాదం

రవాణా కార్యాలయానికి వెళుతున్న సమయం లో బురద మయంగా మారిన గోతుల్లో ద్విచక్ర వాహనం పడి ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులు సైతం గుంతలమయమైన రోడ్డులో వెళ్లేందుకు భయాందో ళనకు గురవుతున్నారు. రవాణా శాఖాధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే..

సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే అని సీనియర్ సివిల్ జడ్జి ఎం భారతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం న్యాయ అవ గాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు స్కూలుకు, కాలేజీలకు వెళుతున్నారా.. లేదా? గమనించాలన్నారు. వాళ్లు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులు తగాదా.. లేదంటే పంట భూముల గురించి ఒకరికొకరు గొడవలు పడినప్పుడు వీలైనంతవరకు పోలీస్ స్టేషన్, కోర్టుకు వెళ్లకుండా గ్రామంలోనే పెద్ద మనుషుల ద్వారా పరిష్కరించు కోవాలన్నారు. కొన్ని తప్పుడు యాప్‌ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు దోచుకోవాలని చూస్తున్నారని కొన్ని లింకులు క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకోకుండా జాగ్రత్త పాటించాలన్నారు. తల్లి దండ్రులు వారి కుమార్తె లకు బాల్య వివాహాలు చేయొ ద్దని ఆమె హితవు పలికా రు. కోర్టు ల్లో దీర్ఘ కాలికంగా కొన సాగుతున్న కేసుల పరంగా రాజీ వెళ్లేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నవంబర్ 13వతేది చిత్తూరులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో వెంకట నారాయణ, ఎంపీడీవో మనోహర్ గౌడ్ డిప్యూటీ తహశీల్దారు మహేష్ కుమార్, ఏఎస్‌ఐ మురళి ప్రసాద్ ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ఏపిఎం ఫరీద్ మస్తాన్, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపరు వైజర్ అనురాధ పలువురు అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

ఏపీఎస్ఇబి కార్యవర్గ ఏర్పాటు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఈనెల 24వ తేదీ నిర్వహించారు. నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గం నివేదికను రాష్ట్ర కమిటీకి పంపారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఆమోదించింది. ఏపీ ఎస్‌పిడీసీఎల్ నూతనంగా చిత్తూరు సర్కిల్ ఆఫీస్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో దానికి అనుసంధానంగా ఏపీ ఎస్ ఇబి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చిత్తూరులో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎన్నుకున్నారు. ఈ నెల 24 వ తేదీ చిత్తూరులో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రీజినల్ అధ్యక్షులుగా కె సాంబశివుడు, రీజినల్ కార్యదర్శిగా ఆర్ తనిక వేలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం రఘునంద నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శిగా బి శివకుమార్, రీజినల్ ట్రెజరర్‌గా బి హేమ సుందర్, రీజినల్ ఉపాధ్యక్షులుగా కే సిద్దయ్య, డి రవి, వి దామోదరం, ఎస్ రవీంద్రరావు, రీజినల్ జాయింట్ కార్యదర్శిలుగా ఎస్ శివకుమార్, ఎం వెంకటేశులు, రీజినల్ సహాయ కార్యదర్శు లు గా బి దామోదరం, ఎం సహదేవా నాయక్, మహిళ రెస్పెక్టివ్‌గా వైపి స్వప్న ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కె సాంబశివుడు



ఆర్ తనికవేలు

వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై నో పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాహన దారులపై పోలీసు శాఖ కఠిన చర్యలు ప్రారంభించింది. చిత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లి ట్రైనింగ్ సబ్‌ఇన్స్పెక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వి కోట రోడ్డు, మండల కేంద్రంలోని అనేక ప్రాంతాల్లో నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలిపిన పలువురిపై జరిమానాలు విధించారు. గతంలోనే అనేకసార్లు హెచ్చరికలు చేసినా కొందరు వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నిలుపుతున్నారని అధికారులు తెలిపారు. వాహనదారులతో పాటు, తమ షాపుల ఎదుట వాహనాలు నిలిపేందుకు కారణమైన టీషాపులు, వ్యాపార సంస్థల యజమానులపైనా జరిమానాలు విధిం చారు. ఇకపై కూడా ఈ విధంగా కొనసాగితే సంబంధిత వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపర చనున్నట్లు వారు తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి..

ప్రజాశక్తి-పెద్దపంజాణి: దళితులకు శ్మశాన వాటిక కు స్థలం కేటాయించాలని మండల కేంద్రంలోని దళిత కాలనీ వాసులు స్థానిక తహశీల్దారు హనుమంతుకు విన్నవించుకున్నారు. మండల కేంద్రంలోని దళితవాడలో పౌర హక్కుల పై గురువారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కల్పన, వెలుగు ఏపిఎం నీరజ,గ్రామ రెవెన్యూ కార్యదర్శి సుజాత, పంచాయతీ కార్యదర్శి లత,సర్వేర్ వెంకటేష్ వైద్యశాఖ అధికారులు, మొదలగు మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డబ్బులిచ్చి పదవులు పొందాల్సిన అవసరం లేదు: ఎంపిపి

ప్రజాశక్తి -కార్వేటినగరం: ఐదు దశాబ్దాల కాలంగా రాజకీయం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తూ వస్తున్న శ్రీరాములు నాయుడు కుటుంబానికి డబ్బులిచ్చి పదవులు పొందాల్సిన అవసరం లేదని ఎంపీపీ లతా బాలాజీ అన్నారు. మండల కేంద్రంలోని తమ స్వగృహంలో గురువారం ఎంపీపీ విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం పాల సముద్రం మండలం ఎంపీపీ శ్యామల, శివప్రకాష్ రాజు కుమార్తె వివాహ సందర్భం గా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరైతే కొన్ని పత్రికలు రాజకీయ రంగులు పులిమి ఎంపీపీ కుటుంబం మాజీ సీఎం నారాయణ స్వామి కుటుంబానికి వ్యతి రేకంగా పని చేస్తున్నారని, డబ్బులిచ్చి ఎంపీపీ పదవులు పొందారని, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి లక్షల రూపాయలు తీసుకుని పదవులు ఇచ్చారని అసత్య కథనా లు అల్లడం సమంజసం కాదన్నారు. డబ్బు లిచ్చి పదవులు పొందా ల్సిన అవసరం' శ్రీరాములు నాయుడు కుటుంబానికి లేదన్నా రు. ఇలాంటి కథనాలు మళ్లీ పునార వృతమైతే చట్టపర చర్యలు చేపడు తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్ వైస్ సర్పంచ్ శేషాద్రి, ఎంపీటీసీలు దేశమ్మ, మురగయ్య, సర్పంచ్ శీలారాణి, పవన్ కుమార్, గోపి, రాజారెడ్డి, జేజేలురెడ్డి, మురగయ్య, విజయకుమార్, వరాలురెడ్డి పాల్గొన్నారు.



క్రైం న్యూస్

వైసిపి నాయకుడిపై హత్య కుట్ర కేసు..

నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి- కుప్పం: వైసిపి నాయకుడిపై హత్య కుట్ర కేసులో ఐదు సంవత్సరాలుగా పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని కుప్పం అర్బన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. 2020లో కుప్పం పట్టణంలో వైసీపీ కీలక నాయకుడిని హత్య చేయడానికి కుట్ర పన్నిన కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన సిఎం రమేష్ (49), తండ్రి మునెప్ప, కోటగడ్డ గ్రామం, శాంతిపురం మండలం, చిత్తూరు జిల్లా, గురువారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. 2020లో వైసీపీ అంతర్గత విభేదాల నేపథ్యంలో పార్టీ నాయకుడు ఎఎస్ విద్యాసాగర్‌ను హత్య చేయాలని రత్న, రమేష్, క్రిష్ణమూర్తి కలిసి కుట్ర పన్నారు. వీరు ముగ్గురూ విద్యాసాగర్‌ను చంపడానికి పీలేరుకు చెందిన గణేష్‌కు సుపారీ ఇచ్చారు. వీరిలో రత్న, క్రిష్ణమూర్తి, గణేష్ ముగ్గురిని 2020 వ సంవత్సరంలో పోలీసులు పట్టుకుని జైలుకు పంపగా, రమేష్ పోలీసులకు కంటపడకుండా పారిపోయాడు. అప్పటి నుండి రమేష్ ఆచూకీ కనుగొనడానికి పోలీసులు నిఘా వేశారు. తాజాగా విశ్వసనీయ సమాచారం మేరకు కుప్పం ఎస్‌ఐ శంకరయ్య నేతృత్వంలోని బృందం, ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి రమేష్‌ను అతని స్వగ్రామం కోటగడ్డ వద్ద అరెస్ట్ చేశారు. ఐదు సంవత్సరాలుగా పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడంలో చూపిన కృషిని గుర్తిస్తూ, కుప్పం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎస్‌ఐ శంకరయ్య ఆయన బృందాన్ని అభినందించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ఒకరు పరిస్థితి విషమం, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -వి కోట : మండల పరిధిలోని తోటకనుమ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటక వెళ్లి, సొంత ఊరు బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామానికి ఆటోలో ముగ్గురు వ్యక్తులు వెళు ండగా మార్గమధ్యంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో ఇద్దరు వ్యక్తులు బయటపడగా, కృష్ణమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు 108 సాయంతో వికోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కుప్పం పిఈ ఎస్ హాస్పిటల్ కి తరలించారు.

తాత్కాలిక కల్వర్టు నిర్మాణం

పలువురి ప్రశంస

ప్రజాశక్తి-సోమల: వారం రోజుల పాటు ఎడతెరిపి లేని వర్షం, భారీ వర్షం కారణంగా వంకలు, వాగులు పొంగి పొరలి పలు ప్రాంతాలలో వంకలపై నిర్మించిన తాత్కాలిక మట్టి కల్వర్టులు కొట్టుకుపోయాయి. పట్టించుకునే నాథుడే కరువు కావడంతో ప్రజలే రెండుసార్లు శ్రమదానం చేసి జీడి రేవుల వంక పై పెద్దపెద్ద పైపులు వేసి వాటిపై ఇసుక మూటలు, మట్టి తోలి తాత్కాలిక మట్టి రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. అయితే వారు తయారు చేసిన మట్టి రోడ్డు భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోవడంతో గత వారం రోజులుగా పూర్తిగా సోమల నుండి నంజంపేట, 81 చిన్న ఉప్పరపల్లి, ఆవులపల్లి, పెద్ద ఉప్పరపల్లి, పేటూరు, అన్నెమ్మ గారి పల్లి పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. పెద్ద ఉప్పరపల్లి పోవాలంటే సోమల నుండి సదుం, శీలం వారి పల్లి ,నంజంపేట మీదుగా 40 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల ప్రయాణికుల సమస్యలను గుర్తించిన మండల జనసేన అధ్యక్షులు నాగభూషణం రాయల్ మండల కార్యవర్గం సభ్యులు గురువారం జెసిబి కూలీలు పెద్దపెద్ద పైపులు తీసుకువచ్చి రోజంతా శ్రమించి తాత్కాలిక మట్టి వంతెన నిర్మించి రాకపోకలు సాగేలా ఏర్పాటు చేశారు. సొంత ఖర్చుతో తామంతా ప్రజల ఇబ్బందులు గుర్తించి వంతెన నిర్మాణానికి శ్రమదానంతో కష్టపడి నిర్మాణాన్ని చేపట్టామని కళ్యాణ్, మురళి, జగదీష్, జగన్మోహన్, జాకీర్ ,చెంగల రాయుడు, మణి, షబ్బీర్ అన్నారు.

ఇంటి స్థలాలు ఇప్పించండి

- గ్రామ కంఠం ఆక్రమణలు తొలగించండి
- తహశీల్దారుకు గ్రామస్తుల వినతి



ప్రజాశక్తి -యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలు పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటామని తహశీల్దారు పార్థసారథి తెలిపారు. గురువారం ఓటి వారి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు ఆది ఆంధ్ర వాడలో రెవెన్యూ ,పోలీసు, అభివృద్ధి, వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్స వం నిర్వహించారు . ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ గ్రామాల్లో మౌలిక సమస్యలు, భూ సమస్యలు, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలోని రెవెన్యూ శాఖ పరిధిలో మరి ఇతర శాఖల పరిధిలోని సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తూరు ఆది ఆంధ్ర వాడలో గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామ ప్రజలు తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. గ్రామకంఠం సంబంధించిన భూములను చుట్టుపక్కల కొంతమంది ఆక్రమించు కున్నారని గ్రామకంఠంలో సర్వే చేసి గ్రామ కంఠం హద్దులను గుర్తించాలన్నారు. గ్రామంలో ఇంటి స్థలాలు లేకుండా అనేకమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమి ని సర్వే చేసి ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని గ్రామస్తులు తమశీల్దారుకు వినతిపత్రం అందించారు. గ్రామంలో శ్మశాన స్థలం ఆక్రమణకు గురైందని సర్వే చేయాలన్నారు. తమ భూములు ఆన్లైన్లో లేదని మాకు రైతు భరోసా రావడం లేదని, ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయాలని, గృహ నిర్మాణ శాఖ , రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య, గ్రామానికి సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రాజశేఖర్ మాట్లాడుతూ జీవన ప్రమాణాలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే అలాంటి వారిపై పోలీసు రెవెన్యూ శాఖల సమన్వయంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఎంపీడీవో వీరేంద్ర మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలను, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అభివృద్ధి పనులు మంజూరు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో సంధ్యారాణి , మండల విద్యాశాఖ అధికారిణి రుక్మిణి, ఓటి వారి పల్లి సర్పంచ్ పత్తిపాటి భగవతి రాజేంద్రనాయుడు, విద్యాశాఖ అధికారి రుక్మిణి, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారిణి సంధ్యారాణి, వెలుగు సమైక్య ఏపిఎం ఈశ్వరమ్మ, వ్యవసాయ అధికారి దీప పాల్గొన్నారు.